సాక్షి
బాపట్ల
శనివారం । 19 । ఏప్రిల్ । 2025



గుర్రం జాషువాకు నివాళి

పట్నంబజారు: ఆనందపేట శ్మశానవాటిక లోని గుర్రం జాషువా సమాధి వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు అంబటి రాంబాబు, షేక్ నూరి ఫాతిమా శుక్రవారం నివాళులర్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 515.00 అడుగుల వద్ద ఉంది. ఇది 140.3150 టీఎంసీలకు సమానం.



దుర్గమ్మకు బంగారు హారం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు విస్సన్నపేటకు చెందిన భక్తులు శుక్రవారం బంగారు హారాన్ని కానుకగా సమర్పించారు.

కప్పం కడితే రైట్ రైట్

- గ్రానైట్‌లో వసూళ్ల దందా
- చినబాబు నెల మామూళ్లు రూ.50 కోట్లు
- అద్దంకి, పర్చూరు పచ్చనేతలకు చెరో రూ.8 వేలు
- రూ.10 వేలు డిమాండ్ చేస్తున్న గురజాల పచ్చనేత
- తనకు రూ.8 వేలు కావాలంటున్న నరసరావుపేట నాయకుడు
- కప్పం కట్టకపోతే సేల్‌టాక్స్, లోకల్ పోలీసులను ఉసిగొల్పుతున్న వైనం
- ఫ్యాక్టరీ యజమానులతో మంత్రి గొట్టిపాటి సమావేశం
- వసూళ్ల విషయం మీరే చూసుకోవాలని ఫ్యాక్టరీ యజమానులకు ఆదేశం
- తలలు పట్టుకుంటున్న పరిశ్రమల యజమానులు, బయ్యర్లు
- పచ్చ దోపిడీపై సర్వత్రా ఆగ్రహం



బల్లికురవలో గ్రానైట్ క్వారీ

సాక్షి ప్రతినిధి,బాపట్ల: కూటమి సర్కార్ దోపిడీ శృతిమించి రాగానపడింది. గ్రానైట్ పరిశ్రమల నుంచి పెద్దఎత్తున దండుకునేందుకు పచ్చనేతలు సిద్ధమయ్యారు. ప్రభుత్వానికి చెల్లించే పన్ను సంగతి దేవుడెరుగు ముందు మా సంగతి చూడమంటున్నారు. పన్ను ఎగనామం పెట్టినా ఫర్వాలేదు మాకు మాత్రం నెల మామూళ్లు ఇవ్వాల్సిందేనని హుకుం జారీచేశారు. అడిగిన మొత్తం చెల్లించకపోతే రాష్ట్ర సరిహద్దులు దాటినిచ్చేది లేదని బెదిరింపులకు దిగారు. పచ్చనేతల నెల మామూళ్లు ప్రభుత్వానికి చెల్లించే పన్ను కంటే అధిక మొత్తంలో ఉండడంతో బయ్యర్లు బెదిరిపోతున్నారు. మీకు కప్పం చెల్లించి వితౌట్(టాక్స్ లేకుండా)లో గ్రానైట్ పంపే దానికంటే ప్రభుత్వానికి పన్ను చెల్లించి దర్జాగా తీసుకెళ్లడమే మేలని వ్యాపారులు భావిస్తున్నారు.

చినబాబు కప్పం రూ.50 కోట్లు

బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉన్న గ్రానైట్ క్వారీలు, పరిశ్రమల నుంచి నెలకు రూ.50 కోట్లు ఇవ్వాలని చినబాబు జిల్లా గ్రానైట్ మంత్రిని ఆదేశించినట్లు సమాచారం. మంత్రి హుటాహుటిన గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు, బయ్యర్లతో సమావేశం పెట్టి వ్యవహారం చక్కబెట్టాలని రెండు జిల్లాల మైనింగ్ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. మంత్రి ఆదేశాలతో ఇటీవల గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీ యజమానులతో అధికారులు తొలుత సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత జిల్లా మంత్రి వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఒకరిద్దరికైతే కప్పం చెల్లించగలంకానీ పదుల సంఖ్యలో ఉన్న పచ్చనేతలందరికీ నెల మామూళ్లు ఇవ్వడం కుదరదని క్వారీ, పరిశ్రమల యజమానులు తేల్చి చెప్పినట్లు సమాచారం. మీరడిగినంత మొత్తం కట్టలేమని, ఇలాగైతే వ్యాపారమే మానుకుంటామని మరికొందరు వ్యాపారులు ఏకంగా మంత్రికే తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. ఇలాగైతే బయ్యర్లు పలకలు తీసుకెళ్లేందుకు ఇష్టపడరని అదే జరిగితే వ్యాపారాలు మూత పడతాయని మరికొందరు వ్యాపారులు మంత్రికి వివరించినట్లు సమాచారం. అన్నీ విన్న మంత్రి పైనుంచి వచ్చిన ఆదేశాలు పాటించడం తప్ప తాను చేయగలిగిందేమీ లేదని వ్యాపారులకు తేల్చిచెప్పినట్లు సమాచారం. దీంతో మైనింగ్, విజిలెన్స్ అధికారులు మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు, ప్రకాశం జిల్లా పరిధిలోని చీమకుర్తి ప్రాంతాల్లోని క్వారీలు, ఫ్యాక్టరీలపై దాడులకు దిగారు. పచ్చనేతల తీరుతో విసిగి పోయిన క్వారీ, పరిశ్రమల యజమానులు వితౌట్‌లో మైనింగ్ చేయడం దాదాపుగా మానుకున్నారు. కొందరు మంత్రి అనుచరులకు ముడుపులు చెల్లించి రాత్రిపూట గుట్టుచప్పుడు కాకుండా గ్రానైట్ తరలిస్తున్నట్లు సమాచారం. పచ్చనేతలకు కప్పం చెల్లించి వ్యాపారం చేయడం కంటే మానుకోవడమే మేలని కొందరు బయ్యర్లు వ్యాపారానికి తాత్కాలికంగా స్వస్తిపలికారు. ఇప్పుడు ఈ విషయం జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. భూగర్భ గనులశాఖలో ఇది మరింత చర్చనీయాంశంగా మారింది.

శృతిమించిన పచ్చనేతల మామూళ్ల దందా

చినబాబు కప్పం వ్యవహారం పక్కనబెడితే స్థానిక పచ్చనేతలంతా గ్రానైట్‌పై పడ్డారు. గ్రానైట్ పాలీషింగ్ పలకలు టాక్స్ లేకుండా తీసుకెళ్లేందుకు లారీకి ఏఎమ్మార్ టోకెన్‌కు రూ.25 వేలు చెల్లించాల్సి వస్తోంది. వాస్తవానికి ఏఎమ్మార్ ఇచ్చే టోకెన్ రూ.8 నుంచి రూ.10 వేలకు మించి ఉండదు. పేరుకు ఏఎమ్మార్ చెక్‌పోస్టులు నడుపుతున్నా అనధికారికంగా పచ్చనేతలే టోకెన్ల వ్యవహారం చూస్తున్నట్లు ప్రచారం. ఇది కాకుండా గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీలు ఉన్న పర్చూరు, అద్దంకి పచ్చనేతలకు వ్యాపారులు నెలకు చెరో రూ.8 వేలు కప్పం కడుతుండగా నరసరావుపేట పచ్చనేత రూ.8 వేలు డిమాండ్ చేస్తున్నారు. ఇక గ్రానైట్ దందాకు ఆద్యుడైన గురజాల నేత తనకు రూ.10వేలు ఇవ్వాల్సిందేనని పట్టుబడుతుండగా చిలకలూరిపేట నేత మాత్రం తనకు రూ.6 వేలు చాలన్నట్లు సమాచారం. మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు ప్రాంతాల నుంచి ప్రతిరోజూ 150కి తగ్గకుండా లారీలు వితౌట్‌లో హైదరాబాద్‌కు తరలిపోతుండగా ఇందులో చిలకలూరిపేట, విజయవాడ మీదుగా 30, నరసరావుపేట, గురజాల మీదుగా 120 లారీలు వెళుతున్నట్లు సమాచారం. వీరంతా ప్రతి లారీకి కప్పం చెల్లించాల్సిందేనని బయ్యర్లకు హుకుం జారీచేశారు.



ఎగుమతికి సిద్ధంగా పలకల రాళ్లు

ఏఎమ్మార్ టోకెన్‌తోపాటు పచ్చనేతలకు ఇస్తున్న కప్పంతో కలుపుకుంటే ఒక్కో లారీకి రూ.58 వేలు ఖర్చు వస్తోంది. వాస్తవంగా ప్రభుత్వానికి టాక్స్ చెల్లించినా ఇంత మొత్తంలో ఖర్చురాదు. దీంతో బయ్యర్లు పచ్చనేతలు చెప్పిన మొత్తాన్ని చెల్లించలేమంటూ అడ్డం తిరిగినట్లు సమాచారం. ఒకవేళ ఏఎమ్మార్ టోకెన్‌కు చెల్లించే మొత్తాన్ని రద్దు చేయిస్తే పచ్చనేతలు అడిగిన మేరకు కప్పం చెల్లిస్తామని బయ్యర్లు తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది.

ఇంద్రకీలాద్రికి పెరిగిన రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వారాంతం, పండుగలు, వేసవి సెలవుల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ పెరిగింది. శుక్రవారం కావడంతో తెల్లవారుజాము నుంచే పెద్దఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి విచ్చేసిన యాత్రికులతో ఉదయం 7 గంటల నుంచే ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లలో రద్దీ కనిపించింది. మధ్యాహ్నం 3 గంటల వరకు రద్దీ కొనసాగగా, ఆది దంపతులకు నిర్వహించిన ఆర్జిత సేవల్లో ఉభయదాతలు పాల్గొన్నారు. నూతన వధూవరులు పెళ్లి దుస్తుల్లో అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అంతరాలయ దర్శనం రద్దు

రద్దీ నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచే అంతరాలయ దర్శనాన్ని ఆలయ అధికారులు రద్దు చేశారు. రూ.300, రూ.100 టికెట్లను మాత్రమే విక్రయించారు. దీంతో వీఐపీల పేరిట వచ్చే భక్తులతో పాటు సిఫార్సు లేఖలపై వచ్చే వారికి సైతం ముఖ మండప దర్శనం మాత్రమే కల్పించారు. రద్దీ నేపథ్యంలో సర్వ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో ఆలయంలో రద్దీ మరింత పెరిగింది. రద్దీ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా భక్తులు ముందుకు కదిలేలా ఆలయానికి చెందిన వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది క్యూలైన్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత అంతరాలయ దర్శనాన్ని పునరుద్ధరించారు.

ఆర్జిత సేవలకు డిమాండ్...

చైత్ర మాసం కావడంతో శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

21న చీరాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

బాపట్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని చీరాల మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజల సౌలభ్యం కోసం చీరాల నియోజకవర్గ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చీరాల నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్ల పరిశీలన



తాడికొండ: మే 2న వివిధ కార్యక్రమాల ప్రారంభోత్సవానికి హాజరుకానున్న ప్రధాన మంత్రి మోదీ బహిరంగ సభ ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్, జేసీ భార్గవ్‌తేజ తదితరులు పరిశీలించారు.

డాక్టరేట్ పొందిన ఆటో డ్రైవర్ శంకర్‌రావుకు అభినందనలు



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూనే కాలికట్ యూనివర్సిటీ ఎకనామిక్స్‌లో డాక్టరేట్ పొందిన గండికోట శంకర్‌రావును ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌టిడబ్ల్యూఎఫ్)అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య సత్కరించారు. శుక్రవారం పాతగుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సంఘ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు అధ్యక్షతన అభినందన సభ జరిగింది. ఆర్ లక్ష్మయ్య మాట్లాడుతూ గండికోట శంకరరావు ఆటో డ్రైవర్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా, ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు పాల్గొన్నారు.

చెలరేగిన మృగాడు

- భార్యపై అనుమానంతో బ్లేడుతో గొంతు కోసిన భర్త
- క్రోసూరులో దారుణం



క్రోసూరు: స్థానిక బోయ కాలనీలో భార్యపై అనుమానం పెంచుకుని భర్త బ్లేడుతో గొంతుకోసిన సంఘటన శుక్రవారం జరిగింది. స్టేషన్ రైటర్ దాసు వివరాల ప్రకారం.. బోయ కాలనీకి చెందిన చార్ల శ్రీను భార్య మల్లమ్మ. ఆమె ఎవరితోనో ఫోనులో మాట్లాడుతుండటంతో అనుమానపడి శ్రీను బ్లేడుతో దాడి చేసి గొంతు కోశాడు. చుట్టుపక్కల వారు ఆమెను సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమెకు వైద్యులు 25 కుట్లు వేశారు. ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా ఉంది. మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. శ్రీను, మల్లమ్మలకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కూడా అయింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు రైటర్ దాసు తెలిపారు.

పాక్ జలసంధిని ఈదిన గణేష్



విజయవాడస్పోర్ట్స్: తమిళనాడులోని ధనుష్‌కోటి నుంచి శ్రీలంకలోని తలైమన్నార్ వరకు ఉన్న పాక్ జలసంధిని ఆంధ్రప్రదేశ్ పారా స్విమ్మర్ బి.గణేష్ సాహసోపేతంగా ఈదాడు. శుక్రవారం ఉదయం 5.50 గంటలకు తలైమన్నార్‌లో ఈతను ప్రారంభించి సాయంత్రం 4.20కి ధనుష్‌కోటికి చేరుకున్నారు. 28 కిలోమీటర్లు పొడవున్న సముద్రాన్ని 10.30 గంటల్లో ఈదాడు. తెలుగు రాష్ట్రాల్లోని పారా స్విమ్మర్‌లలో పాక్ జలసంధిని ఈదిన మొట్టమొదటి పారా స్విమ్మర్‌గా ఖ్యాతిగడించారు. స్విమ్మర్ గణేష్ ప్రస్తుతం ఏలూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో స్విమ్మింగ్ కోచ్‌గా పని చేస్తున్నాడు.

కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు

- ఆళ్లవారిపాలెం నుంచి పల్లె పడక ప్రారంభం
- వైఎస్సార్ సీపీ రేపల్లె సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



మాట్లాడుతున్న డాక్టర్ ఈవూరు గణేష్, వేదికపై ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు

రేపల్లె రూరల్: హామీలను అమలు చేయడంలోను, సమస్యలను పరిష్కరించటంలోను కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. ప్రజాసమస్యలను తెలుసుకునేందుకు వినూత్నంగా మొదలుపెట్టిన పల్లెపడక కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన చెరుకుపల్లి మండలం ఆళ్లవారిపాలెం పంచాయతీ బాప్టిస్టుపాలెంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, గురవుతున్న ఇబ్బందులను తెలుసుకొని ప్రభుత్వ వైఫల్యాలపై అవగాహన కలిగించేందుకు పల్లెపడక కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి పల్లెను, ప్రతి గడపలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకోవటమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సమస్యలను తెలుసుకోవటంతోపాటు ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక పరిష్కరించేదిశగా పనిచేస్తామన్నారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించి ప్రజలతో ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పది నెలల కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. గుళ్లపల్లిలోని పార్టీ క్యాంపు కార్యాలయం నుంచి బాప్టిస్టుపాలెం వరకు నిర్వహించిన ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు కరేటి శేషగిరిరావు, మేడికొండ అనిల్, దుండి వెంకటరామిరెడ్డి, ఇంకొల్లు రామకృష్ణ, యార్లగడ్డ వెంకట రాంబాబు, నాయకులు యార్లగడ్డ మదనమోహన్, చిమట బాలాజీ, చిత్రాల ఓబేదు, చదలవాడ శ్రీనివాసరావు, బసవయ్య, కేవీ కృష్ణారెడ్డి , నిజాంపట్నం కోటేశ్వరరావు, రాజు, సాంబశివారెడ్డి, కొండల్‌రెడ్డి, నాగలక్ష్మి, రత్నాకర్, రఘు, కిరణ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ కేంద్రం పెద్దల కుట్ర

- ఇంకొల్లులో నినదించిన ముస్లిం సోదరులు
- ముస్లింల ఆస్తులు అదానీ, అంబానీలకు ధారాదత్తం
- ర్యాలీలో పాల్గొన్న ముస్లిం మహిళలు



నల్లజెండాలతో ర్యాలీలో పాల్గొన్న ముస్లిం మహిళలు

ఇంకొల్లు(చినగంజాం): వక్ఫ్ చట్టంలో సవరణలు చేయడం ముస్లింల మత స్వేచ్ఛపై దాడి చేయడమేనని ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకొల్లులో శుక్రవారం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ముస్లిం మహిళలు సైతం పాల్గొన్నారు. పలువురు ముస్లిం సోదరులు మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణ ముస్లింల హక్కులను హరించే విధంగా ఉందని, ముస్లింల ఆస్తులు అంబానీ, అదానీలకు కట్టబెట్టడానికి మోదీ ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని సవరించిందని అన్నారు. వక్ఫ్ బోర్డు, వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిం యేతరులకు అవకాశం కల్పించడం సమంజసమేనా అని సుప్రీంకోర్టు ప్రశ్నించిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని లేకుంటే ముస్లింలంతా కలిసి ఐక్యంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ సభ్యులు షేక్ ఉస్మాన్ అలి, షేక్ బాషా, షేక్ మాబుల్లా, షేక్ ఈసూబ్, బాబు, సీపీఐ నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొంగు బంగారం.. పోలేరమ్మ తల్లి



తిరునాళ్లకు ముస్తాబైన పేరాల పోలేరమ్మ దేవాలయం

ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న పేరాల పోలేరమ్మ తల్లి

- కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పేరాల పోలేరమ్మ తల్లి
- 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు
- 22న శిడిమహోత్సవం, తిరునాళ్లు

చీరాల: కోరిన కోర్కెలు తీర్చి భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న పేరాల పోలేరమ్మ తల్లి శిడి మహోత్సవం అంగరంగ వైభవంగా జరగనుంది. పోలేరమ్మ గుడి స్థాపించి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా తిరునాళ్లను ఐదు రోజులపాటు వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 22న శిడి మహోత్సవం, తిరునాళ్ల నిర్వహించనున్నారు.

తిరునాళ్ల విశిష్టత

చీరాల పట్టణంలో పెద్ద ఎత్తున జరిగే పోలేరమ్మ తిరునాళ్లకు ఎంతో విశిష్టత ఉంది. స్థానిక హరిప్రసాద్‌నగర్‌లో పోలేరమ్మ తల్లి వేంచేసి ఉంది. 49 ఏళ్లుగా ప్రతి ఏడాదీ అమ్మవారి తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తారు. శక్తి స్వరూపం కలిగి, భక్తుల పాలిట కొంగు బంగారంగా ఉండే పోలేరమ్మ అమ్మవారి గుడి అంటే చీరాల ప్రాంతంలో మంచి ప్రసిద్ధి ఉంది. తొలుత స్థానిక గ్రామస్తులు చిన్న గుడిని ఏర్పాటు చేసి అమ్మవారిని స్థాపించగా ప్రస్తుతం ఆ దేవాలయం దినదినాభివృద్ధి చెంది పట్టణంలోనే విశిష్టత కలిగిన అమ్మ వారిగా పేరు పొందింది. దేవాలయం అభివృద్ధిలో దేవస్థాన కమిటీ, సభ్యులు విశేష కృషి చేశారు. ప్రతివారంలో మంగళ, ఆదివారాల్లో భక్తులు విరివిరిగా వచ్చి విశేష పూజలను నిర్వహిస్తుంటారు. ఆపదలో ఉన్న భక్తుల కష్టాలు, కోర్కెలను తీర్చే తల్లిగా పోలేరమ్మ తల్లికి పేరుంది. అందుకే ప్రతి ఏడాది అమ్మవారి తిరునాళ్ల, శిడి మహోత్సవాన్ని ఘనంగా జరుపుతారు. తిరునాళ్ల రోజు శిడి పెళ్లి కొడుకుతో ఊరేగింపుగా అమ్మవారి గుడికి వెళ్ళి గుడి వద్ద ఉండే శిడి మానుకు ఒక పెట్టెలో మేకపోతునుంచి, గుడి చుట్టూ మూడు ప్రదక్షణలు చేస్తారు. ఈ సమయంలో శిడిమాను పైభాగంలో చెక్కపెట్టెలో ఉంచిన మేకపోతును భక్తులు జీడికాయలతో కొడుతుంటారు. శిడిమాను లాగితే కష్టాలు తొలిగిపోతాయని భావించే భక్తులు శిడి మాను బండిని లాగేందుకు పోటీ పడతారు.

ప్రత్యేక కార్యక్రమాలు..

50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది తిరునాళ్లను ఐదు రోజులపాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేకంగా ఎల్‌ఈడీ విద్యుత్ ప్రభలు ఆకర్షణగా నిలుస్తాయి. ప్రభలతోపాటు మ్యూజికల్ నైట్, నాటికలు, కళాకారులతో ప్రదర్శనలు, అన్నదానాలు నిర్వహించనున్నారు. తిరునాళ్లను పురస్కరించుకొని పశుసంపదతో పాటు వాహనాలను గుడి చుట్టూ తిప్పి ప్రజలు తమ మొక్కులు తీర్చుకుంటారు. చీరాలతోపాటు పరిసర గ్రామాల నుంచి తిరునాళ్లను చూసేందుకు ప్రజలు వేలాది సంఖ్యలో వస్తుంటారు. భక్తులు అధిక సంఖ్యలో రానున్న సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీగా బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

వాహనాల తనిఖీ



రేపల్లెరూరల్: సంఘ విద్రోహశక్తుల ఆట కట్టించేందుకు పోలీస్‌శాఖ నిఘా పెంచిందని డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు చెప్పారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రధానసెంటర్‌లలో వాహనాలు తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రయాణ సమయంలో వాహనచోదకులు తమ వెంట వాహన రిజిస్ట్రేషన్ పత్రాలను ఉంచుకోవాలన్నారు. ప్రతి వాహనానికి తప్పనిసరిగా ఇన్సూ్యరెన్స్‌లు చేయించుకోవన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని సూచించారు. వాహనాలలో మాదక ద్రవ్యాలను అక్రమంగా రవాణా చేయరాదన్నారు. నిత్యం తనిఖీలు ఉంటాయని అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పట్టణ సీఐ మల్లికార్జునరావు, సిబ్బంది ఉన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దుచేయాలి



కర్లపాలెం: కేంద్ర ప్రభుత్వం ఇటీవల సవరణ చేసిన వక్ఫ్ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని ముస్లింలు డిమాండ్ చేశారు. కర్లపాలెం మండల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ముస్లింలు కర్లపాలెంలో వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నల్ల రిబ్బన్లు ధరించి నిరసన ర్యాలీ చేశారు. తొలుత ముస్లిం మతపెద్దలు, ముస్లిం యువకులు జుమ్మా నమాజ్ అనంతరం కర్లపాలెం కొత్త ఇస్లాంపేటలోని మర్కస్ మసీదు నుండి నల్లరిబ్బన్లు ధరించి జాతీయ జండాలు, నల్ల జండాలు చేతబట్టి కేంద్ర ప్రభుత్వం ముస్లిం పట్ల వ్యవహరిస్తున్న వ్యతిరేక విధానాలు వెంటనే నిలిపివేయాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల సవరణ చేసిన వక్ఫ్ చట్టాన్ని రద్దుచేసి పాత వక్ఫ్ చట్టాన్ని కొనసాగించాలని ముస్లింలు కోరారు.

కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులోని కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ సమన్వయకర్త హరిప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణతతోపాటు, ఇంటర్, డిప్లమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్లలోపు నిరుద్యోగ యువత అర్హులని తెలిపారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, కంప్యూటర్, కమ్యూనికేషన్స్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్ తోపాటు స్పోకెన్ ఇంగ్లిష్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై బెంగళూరులో 35 రోజులపాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15వేలకుపైబడిన వేతనంతో నూరుశాతం ఉద్యోగావకాశాన్ని కల్పిస్తామని, ఇతర వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

- నేరాల నియంత్రణకే వాహన తనిఖీలు
- ధ్రువీకరణ పత్రాలు లేని 136 వాహనాలు సీజ్
- 14 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు
- 268 వాహనాలకు చలానాలు విధింపు
- ఎస్పీ తుషార్ డూడీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ తుషార్ డూడీ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ అక్రమ రవాణా, నేర నియంత్రణ లక్ష్యంగా వాహన తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. జిల్లాలోని చీరాల గడియార స్తంభం సెంటర్, బస్టాండ్ సెంటర్, పేరాల గేటు వద్ద, ఈపురుపాలెం, బాపట్ల పట్టణంలోని చీలు రోడ్డులో జరిగిన వాహన తనిఖీలలో ఎస్పీ స్వయంగా పాల్గొన్నారు. వాహన తనిఖీలు నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, బాపట్ల, చీరాల, రేపల్లె డీఎస్పీలు, ఏఆర్ డీఎస్పీ, ట్రైనీ డీఎస్పీలతో కలిసి జిల్లాలోని పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలను ఎంపికచేసుకొని జిల్లాలోని 31 ప్రదేశాల్లో 3799 వాహనాలను తనిఖీ చేశారు. ధ్రువపత్రాలు లేని 136 అనుమానిత వాహనాలను సీజ్ చేశారు. 268 వాహనాలకు చలానాలు విధించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 14 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడం చేశామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని సంబంధిత కోర్టులో హాజరుపరచున్నారు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడానికే అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు ప్రవేశించకుండా నిరోధించటానికి, నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు వాహన తనిఖీలు ముమ్మరం చేస్తున్నామన్నారు. ప్రజలు రోడ్డు భద్రత నియమాలను, వాహన చట్టాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారుల్లో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. వాహనదారులు సంబంధిత ధ్రువపత్రాలను కలిగి ఉండాలన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులపైన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వీరభద్రస్వామి ఆలయ పూజారిపై విలేకరి దాడి

తనపై దాడి చేశారంటూ పూజారులపై పోలీసులకు ఫిర్యాదు



ఆలయ పూజారి యశ్వంత్

చుండూరు(వేమూరు): వీరభద్రస్వామి ఆలయం పూజారిపై పత్రిక విలేకరి దాడి చేశాడు. పూజారి మామిళ్లపల్లి యశ్వంత్ తెలిపిన వివరాలు.. చుండూరు మండలం మోదుకూరు గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయంలో గోవులకు షెడ్ ఏర్పాటు చేశారు. గోవులకు షెడ్ చాలకపోవడంతో గోవులు ఇబ్బందులు పడుతుండడంతో పూజారులు అదనంగా షెడ్ ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి పూజారికి ఫోన్ చేసి ఎండోమెంట్ అనుమతి పొంది గోవుల షెడ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎండోమెంట్ అధికారుల అనుమతి లేక పోతే షెడ్ నిర్మాణం నిలిపివేయాలన్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి విలేకరి వీరభద్ర స్వామి ఆలయం వద్దకు వచ్చి ఎండోమెంట్ అధికారి అనుమతి ప్రకారం షెడ్ ఏర్పాటు చేస్తున్నార లేదా అని అడిగాడు. షెడ్ నిర్మాణం కోసం ఎండోమెంట్ అధికారి అనుమతి లేదన్నారు. దీంతో విలేకరి షెడ్ నిర్మాణం ఫొటోలు తీశారు. దేవాలయంలో కూడా ఫొటోలు తీశారు. ఈ విషయాన్ని పూజారులు ఎండోమెంట్ పరిపాలన అధికారి రఘురామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆగ్రహించిన విలేకరి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పూజారులు మామిళ్లపల్లి యశ్వంత్, నిరంజన్‌లపై దాడి చేశాడు. పూజారులు తనపై దాడి చేశారంటూ విలేకరి చుండూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మాపై దాడి చేసి, మాపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడం అన్యాయమని పూజారులు పేర్కొన్నారు. పూజారులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం పూజారులకు రక్షణ కల్పించాలన్నారు.



వీరభద్రస్వామి ఆలయంలో గోమాత అదనపు షెడ్ నిర్మాణం పనులు

పాల వ్యాన్ బోల్తా

వ్యక్తికి గాయాలు

జె.పంగులూరు: సురభి డెయిరీకి చెందిన పాల వ్యాను శుక్రవారం ఉదయం మండలంలోని చందలూరు, తూర్పు కొప్పెరపాడు గ్రామాల మధ్య అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న మార్జిన్‌లో బోల్తా పడింది. మండలంలోని జాగర్లమూడి వారి పాలెం వద్ద గల సురభి డెయిరీ నుంచి వాహనం పాల పదార్థాలతో చందలూరు మీదుగా చీరాల వెళ్లేందుకు బయలు దేరింది. తూర్పు కొప్పెరపాడు దాటిన తర్వాత ఎదురుగా ఒక కారు రావడంతో ఆ కారు వెళ్లేందుకు దారి ఇస్తూ పక్కకు రావడంతో అదుపు తప్పి మార్జిన్‌లో పడిపోయింది. ఈ ప్రమాదంలో పాల వాహనంలో ఉన్న ఎస్ కళ్యాణ్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు 108 కు సమాచారం ఇవ్వడంతో అతన్ని అద్దంకి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



రోడ్డు పక్కన బోల్తా పడిన సురభి డెయిరీ పాల వాహనం

రాష్ట్ర హజ్‌కమిటీ చైర్మన్ ఎంపికపై నిరసన

- హసన్‌బాషా ఎంపికకు వ్యతిరేకంగా వీడియో వైరల్
- టీడీపీ సీనియర్ మైనార్టీ నాయకుల్లో అసంతృప్తి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ పదవి గుంటూరుకు చెందిన హసన్ బాషాకు కట్టబెట్టడంపై జిల్లావ్యాప్తంగా ఉన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ మైనార్టీ నాయకులు మండిపడుతున్నారు. పార్టీ జెండాను కాళ్లతో తొక్కి, తగులబెట్టిన హసన్‌బాషాకు పదవి ఇవ్వడం సరికాదంటూ సీనియర్ మైనార్టీ నాయకుడు, టీడీపీ జిల్లా కార్యదర్శి షంషీర్ జాదా ఆవేదన వ్యక్తం చేస్తూ చిత్రీకరించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. పవిత్ర హజ్ కమిటీ చైర్మన్ పదవికి హసన్ అర్హుడు కాదంటూ పలువురు మైనార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ వీడియో ఎమ్మెల్యేలతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లతోపాటు మైనారిటీ మంత్రి ఫారుఖ్ వద్దకు చేరినట్లు సమాచారం. ఈ వీడియోలో హసన్ బాషా 2014 ఎన్నికల సమయంలో రూ.5 వందలు ఇవ్వలేదని పార్టీ జెండాలను, తోరణాలను కాళ్ళతో తొక్కి తగులబెట్టినట్టు జాదా విమర్శించారు. హసన్ నియామకంపై తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌ను ప్రశ్నించానని, అయితే ఎంపికలో తన ప్రమేయం లేదని ఆయన చెప్పినట్టు జాదా పేర్కొన్నారు. ఇదిలా ఉంటే తూర్పు ఎమ్మెల్యే నసీర్ అంజుమన్-ఎ-ఇస్లామియా అధ్యక్షుడిగా, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గా ఇప్పుడు హజ్ కమిటీ సభ్యుడిగానూ పదవులు పొందడంపై మైనార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. హజ్ కమిటీ చైర్మన్ పదవిని కూడా మంచి వ్యక్తికి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

శ్మశానవాటిక సమస్య పరిష్కారానికి కృషి

ఆర్డీవో చంద్రశేఖర నాయుడు



విజయనగర్‌కాలనీ వాసులతో కలిసి భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర నాయుడు

చీరాల టౌన్: వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణంలో శ్మశాన వాటిక భూమి కోల్పోయిన విజయనగర్‌కాలనీ గ్రామస్తుల సమస్యను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖరనాయుడు హామీ ఇచ్చారు. రెండు రోజుల కిందట కలెక్టర్ వెంకట మురళిని విజయనగర్‌కాలని గ్రామ పంచాయతీ పెద్దలు, ప్రజలు కలిసి గ్రామానికి కేటాయించిన శ్మశానవాటిక భూమి 167-ఏ రోడ్డు నిర్మాణంలో కోల్పోయామని ఫలితంగా తాము పడుతున్న బాధలు, ఇబ్బందులను పరిష్కరించాలని వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం విజయనగర్‌కాలనీ గ్రామ పంచాయతీలోని శ్మశానవాటిక స్థలాన్ని గ్రామస్తులు, గ్రామపెద్దలతో కలిసి ఆర్డీవో చంద్రశేఖర నాయుడు పరిశీలించారు. విజయనగర్‌కాలనీ గ్రామానికి 1985లో కేటాయించిన ఎనిమిది ఎకరాల శ్మశాన భూమికి సంబంధించిన రికార్డులతో పాటుగా వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోయిన శ్మశాన భూమి ప్రాంతాలను పరిశీలించారు. తమకు శ్మశాన భూమిని కేటాయించడంతోపాటుగా రోడ్డు నిర్మాణంలో టన్నెల్‌ను తమ గ్రామంలో నిర్మాణం చేయించాలని అధికారులను గ్రామస్తులు కోరారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ విజయనగర్ కాలనీ గ్రామస్తుల సమస్యను జిల్లా కలెక్టర్ వెంకట మురళి సమక్షంలో ఈనెల 21న నేషనల్ హైవే అథారిటీ అధికారులతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ సమక్షంలో పరిష్కారం లభిస్తుందని ప్రజా సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తానని గ్రామస్తులకు ఆర్డీవో హామీ ఇచ్చారు. ఆర్డీవోతో పాటుగా తహసీల్దార్ కె.గోపికృష్ణ, గ్రామస్తులు లక్ష్మీప్రసాద్, ఏసుపాదం, లక్ష్మీనరసయ్య, వందనం, రాజేష్, వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన మారో లారీ

క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్



లారీ నుంచి డ్రైవర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు, 108 సిబ్బంది

అద్దంకి: ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టిన ఘటనలో క్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కుపోయిన సంఘటన మండలంలోని శింగరకొండ వద్ద నామ్ రహదారిలో శుక్రవారం జరిగింది. అందిన సమాచారం మేరకు నాగార్జున సిమెంటు కంపెనీ నుంచి డ్రైవర్ నరేంద్ర లారీలో సిమెంటు లోడు చేసుకుని ఒంగోలు బయలుదేరాడు. ఈ క్రమంలో లారీ శింగరకొండకు సమీపంలోకి రాగానే అదుపు తప్పి ముందు ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దాంతో లారీ క్యాబిన్ లోపలికి చొచ్చుకుపోవడంతో డ్రైవర్ అందులో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై రవితేజ హుటాహుటిన అక్కడకు చేరుకున్నాడు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని, క్యాబిన్‌లో నుంచి డ్రైవర్‌ను బయటకు తీసేందుకు రెండు గంటలపాటు కష్టపడ్డారు. ఎట్టకేలకు పొక్లెయిన్‌తో జాగ్రత్తగా క్యాబిన్‌ను వెనుక్కు వచ్చే విధంగా చేసి డ్రైవర్‌ను బయటకు తీశారు. తీవ్ర గాయాలపాలైన డ్రైవర్‌ను 108 వాహనంలో ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్యాబిన్‌లో డ్రైవర్ ఒక్కడే ఉండడం, అతను అపస్మారక స్థితిలో ఉండడంతో అతని వివరాలు తెలియరాలేదు.

మార్టూరులో మరో చోరీ



మార్టూరు ఎంఆర్ఎఫ్ షోరూంలో సీసీ కెమెరాలో నమోదైన నిందితుడి ఆనవాళ్లు

మార్టూరు: వరుస దొంగతనాల మార్టూరు మండలం ప్రజలు బెంబేలెత్తుతున్నారు. తాజా శుక్రవారం తెల్లవారుజామున మార్టూరులో స్థానిక జాతీయ రహదారి పక్కన గల ఎంఆర్ఎఫ్ టైర్ల షోరూమ్‌లో చోరీ జరిగింది. షోరూం యజమాని కొల్లా రాము తెలిపిన వివరాలు... గురువారం రాత్రి వ్యాపార లావాదేవీల అనంతరం రూ.50 వేల నగదును క్యాష్ కౌంటర్లో ఉంచి యధాప్రకారం షట్టర్ తాళం వేసి ఇంటికి వెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున మూడున్నర గంటల సమయంలో మొహం కనిపించకుండా మాస్క్ ధరించిన ఓ గుర్తు తెలియని అగంతకుడు షోరూం షట్టర్ తాళం ధ్వంసం చేసి లోనికి ప్రవేశించాడు. నేరుగా క్యాష్ కౌంటర్ వద్దకు వెళ్లి అందులోని రూ.50వేల నగదు తీసుకెళ్లాడు. సమీపంలో ఉన్న యజమాని రాముకు చెందిన పాత బట్టల కవర్‌ను సైతం అగంతకుడు తీసుకొని వెళ్లిపోయాడు. తెల్లవారిన తర్వాత షట్టర్ తెరచి ఉండడం గమనించిన స్థానికుల సమాచారంతో షోరూం యజమాని రాము పోలీసులకు సమాచారం అందించాడు. రాముతో కలిసి షోరూమ్ లోని సీసీ కెమెరాను పరిశీలించిన పోలీసులు నిందితుడు ఆనవాళ్లను గమనించారు. రాము సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలో చోరీ జరిగిన తీరును గమనించిన షోరూమ్ యజమాని రాము ఇది ఖచ్చితంగా తెలిసిన వారి పనేనని తెలిపారు.

పోరంబోకు భూమి అన్యాక్రాంతం

- ఆక్రమించిన భూమిలో ఇళ్లు, రెస్టారెంట్ నిర్మాణాలు
- భూమి విలువ రూ.ఐదు కోట్ల పైనే
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు



ఆక్రమించిన భూమిలో నాటిన మామిడి మొక్కలు



ఆక్రమించిన భూములలో నిర్మాణాలు

జె.పంగులూరు: కోట్లాది రూపాయల విలువ చేసే పోరంబోకు భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. కొందరు ఆక్రమించిన భూమిలో శాశ్వత కట్టడాలు, రెస్టారెంట్లు, హోటళ్లు నిర్మించుకుంటున్నారు. మరి కొంతమంది మామిడి తోటనే నాటుకున్నారు. అమ్మకాలు చేసి లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పేదల కడుపు కొట్టి...పెద్దలకు..

మండలంలోని కొండమంజులూరు గ్రామ రెవెన్యూ పరిధిలో బొల్లాపల్లి టోల్ ప్లాజా సమీపంలో జాతీయ రహదారి వెంబడి 58 సర్వే నెంబర్‌లో 2.42 ఎకరాల డొంక పోరంబోకు ఉంది. గతంలో కొంత మంది పేదలు ఆ స్థలంలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. రెవెన్యూ అధికారులు వారిని ఖాళీ చేయించారు. అనంతరం ఆ భూమిని పక్కనే ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ వారు ఆక్రమించగా, మిగిలిన భూమిలో కొంత మంది హోటళ్లు నిర్మించారు.

సొంత స్థలాలు మాదిరిగా అమ్మకాలు

ఆక్రమణదారులు వారి సొంత స్థలం మాదిరిగా అమ్ముకుంటూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. కొంత మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టి అద్దెకు ఇస్తున్నారు. గతంలో పేదల గుడిసెలు ఖాళీ చేయించిన రెవెన్యూ సిబ్బంది ప్రస్తుతం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎకరా భూమి రూ.2 కోట్లు పైమాటే

ప్రస్తుతం ఆక్రమణకు గురైన 2.42 ఎకరాల భూమి విలువ సుమారుగా రూ.5 కోట్లు పై మాటే. జాతీయ రహదారి వెంబడి ఉండటం, బొల్లాపల్లి టోల్ ప్లాజాకు అతి సమీపంలో ఉండే సరికి పెద్దల కన్ను ఈ భూమిపై పడింది.

సెంటు భూమి కూడా వదలం

-చంద్రశేఖర్‌నాయుడు, ఆర్డీఓ, చీరాల

ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఆ స్థలాన్ని పరిశీలించమని పంగులూరు తహసీల్దార్‌ను ఆదేశించాం. సర్వే చేయిస్తాం. ప్రభుత్వ స్థలం ఆక్రమించి ఉంటే వారిని వెంటనే ఖాళీ చేయిస్తాం. సెంటు భూమి కూడా వదలం.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రిషియన్ మృతి



అద్దంకి రూరల్: విద్యుత్ స్తంభం పై నుంచి కిందపడి ఎలక్ట్రిషియన్ మృతి చెందిన సంఘటన అద్దంకి మండలంలోని చిన కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. మృతురాలి భార్య పులి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై రవితేజ కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చినకొత్తపల్లి గ్రామానికి చెందిన పులి నెహేమియా (35) సుమారు 15 సంవత్సరాలుగా ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన జొన్నలగడ్డ రామాంజనేయులు రైస్‌మిల్లుకు కరెంట్ రాకపోవటంతో చూడటానికి వెళ్లి విద్యుత్ స్తంభం ఎక్కి చూస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగలటంతో స్తంభం పై నుంచి కిందపడ్డాడు. స్థానికులు రామాంజనేయులు, తంగిరాల మనోహర్‌లు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యుడు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

ఉపాధి హామీ కూలీ మృతి



బల్లికురవ: ఉపాధి హామీ పథకం పనులు చేస్తుండగా ఎండ వేడిమితో అనారోగ్యం పాలై పదిరోజులపాటు వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. అందిన సమాచారం ప్రకారం.. మండలంలోని కొండాయపాలెం గ్రామానికి చెందిన తన్నీరు శ్రీనివాసరావు (45) పదిరోజుల కిందట గ్రామంలో జరిగిన ఉపాధి పనులకు వెళ్లి ఎండదెబ్బకు గురయ్యాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య ఇరువురు కుమారులు ఉన్నారు. రెక్కాడితేకాని డొక్క నిండని ఈ కుటుంబంలో కుటుంబ యజమాని చనిపోవటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటుంది. అందరితో కలివిడిగా ఉండే శ్రీనివాసరావు అకాల మరణంతో కొండాయపాలెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కొమర్నేనివారిపాలెంలో చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పర్చూరు(చినగంజాం): మండలంలోని కొమర్నేనివారిపాలెంలో శుక్రవారం దొంగతనం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎర్రా వెంకట సుబ్బయ్య ఇంటిలో దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. బీరువాలో ఉన్న 10 సవర్ల బంగారం, రూ.14 వేలు నగదు, ఒక టీవీని అపహరించుకొని వెళ్లారు. గ్రామంలో శుభకార్యం జరుగుతున్న సమయంలో ఇంటిలోకి దొంగలు ప్రవేశించి దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటికి వచ్చిన వెంకట సుబ్బయ్య తలుపులు తీసి ఉండటం, ఇంటిలోని బీరువాలోని బట్టలు చిందరవందరగా పడి ఉండటంతో తన ఇంటిలో దొంగతనం జరిగిందని గుర్తించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్న ఎస్ఐ మాల్యాద్రి ఇంటి పరిసరాలను పరిశీలించి, క్లూస్‌టీంను పిలిపించి వివరాలను సేకరించారు. బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి



పెదనందిపాడులో పొగాకును పరిశీలిస్తున్న రైతు, కౌలురైతు సంఘ నాయకులు

కాకుమాను: ఈ ఏడాది పొగాకు సాగు చేస్తున్న రైతులందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పెదనందిపాడులో రైతులు పండించిన పొగాకును కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ధర సగానికి సగం తగ్గిందని ఆవేదన చెందారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల కష్టాలు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరల స్థిరీకరణ నిధికి ప్రభుత్వం రూ.300 కోట్లు మాత్రమే కేటాయించిందని కనీసం రూ.5వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పొగాకు రైతుల నుంచి పంటను రూ.18వేలకు కొనాలని కోరారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, కౌలు రైతు సంఘం బాపట్ల జిల్లా నాయకులు గంగయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వెకటశివరావు, దొప్పలపూడి రమేష్ బాబు పాల్గొన్నారు.